ఇంటర్న్‌షిప్

చదువు

వేసవి సెలవుల్లో నైపుణ్య ప్రాప్తిరస్తు!

సమ్మర్ సెలవులు వస్తున్నాయ్.. వీటిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని కళాశాల విద్యార్థులందరికీ ఉంటుంది. కానీ ఎలా? ఇంటర్న్‌షిప్‌ల ప్రాధాన్యం తెలిసినప్పటికీ ఏవిధంగా ముందడుగు వేయాలీ, తమ విద్యార్హతలకు తగ్గవి ఏమున్నాయి, ఎంచుకునే పద్ధతేమిటి అనే సందేహాలు ఎదురవుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఇవి ఎక్కువ. అందుకే వేసవి ఇంటర్న్‌షిప్‌ల్లో చేరి పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవటానికి ఉపకరించే సూచనలను అందిస్తున్నాం.

సందీప్ మారుమూల పల్లెటూరి అబ్బాయి. ఓ మోస్తరు పట్నంలో డిగ్రీ చదివి, హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో ఎంబీఏ- హెచ్‌ఆర్, మార్కెటింగ్ చదవడానికి వచ్చాడు. అయితే తన ఆత్మవిశ్వాసం తగ్గడం అతడి అనుభవంలోకి వచ్చింది. తన సహాధ్యాయులు అప్పటికే చొరవతో కళాశాలలో గుర్తింపు పొందారు. వివిధ కార్యకలాపాల్లో, కాలేజీ ఈవెంట్లలో పాల్గొనడం ద్వారా దూసుకువెళ్తున్నారు. సందీప్ విద్యాపరంగా తెలివిగల విద్యార్థే. కానీ ఇతరులతో పోటీపడటానికి ధైర్యం ఎంతో కొంత కూడగట్టుకుంటున్నప్పటికీ వెనుకంజ తప్పటంలేదు. ఏం చేయాలా అని మథనపడసాగాడు.

ఒకరోజు సామాజిక మాధ్యమాలను చూస్తుంటే ఇంటర్న్‌షిప్‌ల గురించి తెలిసింది. వాటిపై ఆసక్తి ఏర్పడింది. కుతూహలంతో వివిధ ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేశాడు. ఒక పార్ట్‌టైం సేల్స్ ఇంటర్న్‌గా చేరాడు.. దీనిలో భాగంగా తను ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడి దుకాణదారులకు ఆన్‌లైన్ విధానం, డిజిటల్ మార్కెటింగ్ ప్రాముఖ్యాన్ని వివరించేవాడు. తనకు తెలియకుండానే కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం అతడిలో బాగా పెరిగాయి.

సర్వేష్ అగర్వాల్
సీఈఓ, ఇంటర్న్‌శాల

ఇంటర్న్‌షిప్ అనుభవం అతడికి ఎంతగా ఉపయోగపడిందంటే.. మళ్ళీ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. అతడు కంటెంట్ రైటర్, హెచ్‌ఆర్.. ఇంకా కొన్ని ఇంటర్న్‌షిప్‌లనూ చేశాడు. క్యాంపస్ అంబాసిడర్‌గా కళాశాల క్యాంపస్‌లో పాల్గొన్నాడు. ఈ ఇంటర్న్‌షిప్‌లన్నిటి అనుభవం తను వివిధ కెరియర్ ఆప్షన్లను ఎంచుకోవడంలో, తన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో, కళాశాలలో పేరు తెచ్చుకోవటంలో బాగా తోడ్పడింది. గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పొందగలిగాడు. తను ఇక చిన్న కుగ్రామం నుంచి వచ్చిన సాధారణ అబ్బాయి కాదు. ఇప్పుడు తనకు ఏ వృత్తి అనువైనదో ఎంచుకోగల ఆత్మవిశ్వాసం ఏర్పడి, సహాధ్యాయులతో కలిసి ఎన్నో ఈవెంట్లలో ధైర్యంగా పాల్గొన్నాడు.

ఎందరో విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌లు ఇలాగే తీర్చిదిద్దటం అసాధారణమేమీ కాదు. ముఖ్యంగా ఈ వేసవి కాలం సెలవులు ఇంటర్న్‌షిప్‌లను చేయడానికి చాలా అనువైన సమయం. ఇంటర్న్‌షిప్‌లు వృత్తిగత అనుభవాన్ని అందిస్తాయి. తద్వారా విద్యార్థులకు తమ గ్రాడ్యుయేషన్ పూర్తికాక ముందే నిజ వాతావరణంలో పనిచేసే అవకాశాన్ని కల్పిస్తాయి. తద్వారా ఫుల్ టైం ఉద్యోగాల ప్రపంచంలోకి వెళ్ళేముందే కావాల్సిన అనుభవాన్ని అందుకున్నట్లవుతుంది.

బీఏ, బీకాం, బీఎస్‌సీ ఇంటర్న్‌షిప్స్

సమ్మర్ ఇంటర్న్‌షిప్స్ అనేవి మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ విద్యార్థులకే పరిమితం కావు. హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్ నేపథ్యమున్నవారు కూడా తమ ప్రొఫైల్స్‌కు తగిన రంగాల్లో ఇంటర్న్‌షిప్‌లు చేయవచ్చు.

- హ్యూమానిటీస్ విద్యార్థులు కంటెంట్ రైటింగ్, ఎడిటోరియల్ ఇంటర్న్‌షిప్స్, మీడియా, జర్నలిజం ఇంటర్న్‌షిప్‌లు చేయటానికి వీలుంది.
- సైన్స్ నేపథ్యమున్నవారు ప్రొఫెసర్లూ, శాస్త్రవేత్తల వద్దా, పరిశోధన సంస్థల్లోనూ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్న్‌లుగా చేరవచ్చు.
- కామర్స్ విద్యార్థులకు ఫైనాన్స్, అకౌంట్స్, సీఏ, టాలీ మొదలైన ఇంటర్న్‌షిప్‌లుంటాయి.

మొత్తమ్మీద ఎన్‌జీఓ, బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, సోషల్ అండ్ డిజిటల్ మార్కెటింగ్‌లలో అన్ని రకాల విద్యార్థులూ ఇంటర్న్‌లుగా చేరవచ్చు. తమ పరిజ్ఞానం మెరుగుపరుచుకోవచ్చు.

వ్యవధి ఎంతకాలం?

ఇంటర్న్‌షిప్‌ల వ్యవధి సాధారణంగా 2-6 నెలలు ఉంటుంది. విద్యార్థి తాను అందుబాటులో ఉండగల సమయాన్ని బట్టి వీటిని ఎంచుకునే వీలుంటుంది. వీటిని బాగా అర్థం చేసుకునేందుకు వీలుగా.. ఇంటర్న్‌షిప్‌లను ఎందుకు చేయాలో చూద్దాం.

1. నైపుణ్యాల మెరుగుదల: ఒక సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసేటపుడు ఒక ప్రొఫెషనల్ వాతావరణంలో పనిచేసే అవకాశం లభిస్తుంది. ప్రొఫెషనల్ కమ్యూనికేషన్‌ను నేర్చుకునే అవకాశమూ ఉంటుంది. ఇది మీ భావప్రకటన నైపుణ్యాలతోపాటు ఇంటర్ పర్సనల్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడంలో, ఐక్యాను పెంచడంలో, పీపుల్, సోషల్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోడంలో తోడ్పడుతుంది. అంతేకాకుండా రియల్ టైం ప్రాజెక్టులపై పనిచేసే అవకాశం లభిస్తుంది. కొత్త సవాళ్లను స్వీకరిస్తూ, రోజువారీ పనిలో భాగంగా కొత్త ఆలోచనలతో రావాల్సి ఉంటుంది. తద్వారా సమస్యా పరిష్కార నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు.

2. నూతన సాంకేతికతలపై అవగాహన: వృత్తిగత వాతావరణంలో పనిచేయడం ద్వారా కొత్త సాంకేతికత, ప్రస్తుతం మార్కెట్‌లో ఉపయోగించే పద్ధతులను తెలుసుకోవచ్చు. ఇది రెజ్యూమేలో మీ వృత్తి అనుభవాన్ని చూపించుకోవడానికే పరిమితం కాక పనితీరులో తరచూ వచ్చే మార్పులను అనుసరించగల తీరునూ, కొత్త వాటిని అలవరచుకోవడానికీ తోడ్పడుతుంది.

3. భిన్న అవకాశాల పరిజ్ఞానం: సాధారణంగా ఇంటర్న్‌షిప్‌ల్లో దీర్ఘకాల నిబద్ధత అవసరముండదు. వివిధ రంగాల్లో లేదా ఏదైనా ఒక రంగంలోని వివిధ విభాగాల్లో ఇంటర్న్‌షిప్‌ను చేయొచ్చు. ఇది వివిధ స్థాయుల నైపుణ్యాలతోపాటు వివిధ రంగాల్లో అనుభవాన్ని పొందగల అవకాశాన్నీ ఇస్తుంది. భిన్న అవకాశాల పరిజ్ఞాన ఫలితంగా మీకు సరైన రంగం ఏదో ఎంచుకునే వీలూ ఉంటుంది.

వర్చువల్/ వర్క్ ఫ్రం హోం

ఇంటర్న్‌షిప్‌ల్లో కాలేజ్‌తోపాటుగా పనిచేసే వీలు కల్పించే పార్ట్‌టైం/ వర్క్ ఫ్రం హోం ఆప్షన్లూ ఉంటాయి. నిజానికి అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. 75% విద్యార్థులు ఆఫీసుల్లో చేసేవాటి కంటే కూడా వర్చువల్ ఇంటర్న్‌షిప్‌లనే ఎంచుకుంటున్నారు. ఇవి గ్రామీణ విద్యార్థులకూ అందుబాటులోనే ఉంటున్నాయి.

ఇంటర్న్‌షిప్‌ను పొందేదెలా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ముఖ్యంగా పల్లెటూళ్ళ నుంచి వచ్చే విద్యార్థులు ఈ విషయంలో చాలా అపనమ్మకంతో, దారి తెలియని స్థితిలో ఉంటున్నారు. నిజానికి ఇదంత సమస్యేమీ కాదు. ఏప్రాంతం వారైనా సరే, ఆసక్తి ఉన్న ఇంటర్న్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌ల్లో సులువుగానే వెతుక్కోవచ్చు.

➡ ఆన్‌లైన్ అంటే.. ఇంటర్నెట్ సాయంతో ఇంటర్న్‌షిప్‌లను అందించే వెబ్‌సైట్లను చూడటం, వివిధ యూనివర్సిటీలు, కళాశాలలకు మెయిల్ చేయడం, ప్రొఫెసర్లు, హెచ్‌ఆర్‌లను ఆన్‌లైన్‌లో సంప్రదించడం, మీ రెజ్యూమేను వివిధ సంస్థల కెరియర్ విభాగాల్లో పొందుపరచడం మొదలైనవి చేయడం.

➡ ఆఫ్‌లైన్ విధానానికి వస్తే.. మీ కాలేజ్ ప్లేస్‌మెంట్ సెల్, వివిధ సంస్థలకు నేరుగా వెళ్లడం, కళాశాల సీనియర్లను సంప్రదించడం మొదలైన విధానాలు కనిపిస్తాయి.

సమ్మర్ ఇంటర్న్‌షిప్ రకాలు

విద్యార్థులకు తమ ఆసక్తి, అందుబాటులో ఉండే సమయాన్ని బట్టి ఇంటర్న్‌షిప్‌లను ఎంచుకునే వీలుంది. కొన్ని ప్రముఖ ఇంటర్న్‌షిప్ శాఖలను పరిశీలిస్తే..

- **మేనేజ్‌మెంట్:** మేనేజ్‌మెంట్‌ను కెరియర్‌గా ఎంచుకుంటున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఇంటర్న్‌షిప్‌ల పరంగా ఎక్కువ అవకాశాలను అందిస్తున్న రంగాల్లో ఇదీ ఒకటిగా నిలిచింది. ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పిస్తున్నవాటిలో మార్కెటింగ్, హెచ్‌ఆర్, సేల్స్, ఆపరేషన్స్ మొదలైనవి ఉన్నాయి.
- **ఇంజినీరింగ్:** పెరుగుతున్న సాంకేతికాభివృద్ధి కారణంగా ఇంజినీర్లకు ఎక్కువ గిరాకీ ఉంది. వీరికి వెబ్ డెవలప్‌మెంట్, క్వాడ్ డిజైన్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ మొదలైనవాటిల్లో ఎక్కువ అవకాశాలున్నాయి.
- **మీడియా:** ఇతర ప్రముఖ ఇంటర్న్‌షిప్ ప్రొఫైళ్లలో కంటెంట్ రైటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ ముందున్నాయి. మీడియా రంగం సోషల్ మీడియా మార్కెటింగ్, బ్లాగింగ్, వీడియో మేకింగ్, జర్నలిజం, కంటెంట్ రైటింగ్ మొదలైన వాటిల్లో అవకాశాలను అందిస్తోంది.
- **డిజైన్:** ప్రతి రెండో సంస్థ నేడు డిజైనర్లను ఎంపిక చేసుకుంటోంది. దీంతో ఇది గిరాకీ ఉన్న విభాగమైంది. యూఐ/యూఎక్స్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ మొదలైన ప్రొఫైళ్లన్నీ ఈ కేటగిరీ కిందకే వస్తాయి.

నైపుణ్యాలను ఏర్పరచుకోవడంతోపాటు మీ రెజ్యూమేలో పని అనుభవ విలువను పెంచడంలోనూ ఇంటర్న్‌షిప్‌లు తోడ్పడతాయి. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడంతోపాటు వృత్తిగత వ్యవహారాలను అర్థం చేసుకోవడంలో, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికీ సాయపడతాయి.

ఇక దేనికోసం ఎదురుచూస్తున్నారు? త్వరగా వెళ్లి మీ సమ్మర్ ఇంటర్న్‌షిప్‌ను అందుకోండి. ఈ సెలవులను ఫలప్రదం చేసుకోండి.

ప్రభుత్వ, ప్రైవేటు ప్రోత్సాహం

- భారత ప్రభుత్వం విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు చేసేలా ప్రోత్సహిస్తోంది. నైపుణ్య శిక్షణకు ఉద్దేశించిన TASK , APSSDC లు విద్యాభ్యాస కాలంలో ఇంటర్న్‌లుగా మారి తమ నైపుణ్యాలు పెంచుకోమని సూచిస్తున్నాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎంఈఏ, ఫైనాన్స్, ఎంసీఏ మంత్రిత్వ శాఖలు, ఆర్‌బీఐ, నీతి ఆయోగ్ మొదలైనవి స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌లను విద్యార్థులకు అందిస్తున్నాయి. సంబంధిత మంత్రిత్వశాఖల (మినిస్ట్రీల) వెబ్‌సైట్లలో ఈ అవకాశాలు చూడవచ్చు.

ప్రైవేటు సంస్థలూ, బహుళజాతి సంస్థలూ, విద్యాసంస్థలూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, ఉబర్ మొదలైన సుప్రసిద్ధ సంస్థల్లో కూడా విద్యార్థులకు వేసవి ఇంటర్న్‌షిప్‌లు లభిస్తున్నాయి.

టీచ్ ఫర్ ఇండియా, సీఆర్‌వై, స్మైల్ ఫౌండేషన్, ఎంఏడీ లాంటి ప్రభుత్వేతర సంస్థల్లో (ఎన్‌జీఓలు) వాలంటీరింగ్ ప్రోగ్రాములున్నాయి. ఈ వేసవిలో విద్యార్థులు వాటిని ఎంచుకోవచ్చు.

కళాశాల విద్యార్థులకే కాదు; పాఠశాల విద్యార్థులకు.. ముఖ్యంగా టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా అసంఖ్యాకంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తున్నాయి. పాఠశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు చేస్తే అవి వారు తోటి విద్యార్థుల కంటే మిన్నగా వృత్తినైపుణ్యాలూ, విషయ స్పష్టత పెంచుకోగలుగుతారు. కంటెంట్ రైటింగ్, వాలంటీరింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, కష్టమర్ సపోర్ట్, ఇంకా బిజినెస్ డెవలప్‌మెంట్‌లో కూడా స్కూలు విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లను ఎంచుకోవచ్చు. దీనిద్వారా వీరు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అద్భుతంగా పెంచుకునే అవకాశం ఉంది.

ఎన్నో వెబ్‌సైట్లు

internshala.com 80 వేల సంస్థలకు చెందిన 4+ లక్షల ఇంటర్న్‌షిప్‌లకు వేదికగా ఉంది. ఇది కాకుండా ఇంకా.. InternAbroad, HelloIntern, Twenty19, LetsIntern సంస్థలు ఇంటర్న్‌షిప్‌ల సమాచారం అందిస్తూ విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయి. ●

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఇండియా సెక్యూరిటీ ప్రెస్, నాసిక్

పోస్టు: జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్
ఖాళీలు: 35
అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు హిందీ/ ఇంగ్లిష్ టైపింగ్ నైపుణ్యాలు.
వయసు: 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: టైపింగ్ స్కిల్ టెస్ట్, ఆన్‌లైన్ రాతపరీక్ష ద్వారా.
దరఖాస్తు ఫీజు: రూ. 200
ఆన్‌లైన్ దరఖాస్తు: 03.04.2018 నుంచి 02.05.2018 వరకు
వెబ్‌సైట్: http://ispnasik.spmcil.com/

నైసర్, భువనేశ్వర్

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైసర్), భువనేశ్వర్.
పోస్టులు-ఖాళీలు: సైంటిఫిక్ అసిస్టెంట్-01, సైంటిఫిక్ ఆఫీసర్-01.
అర్హత: బీఎస్సీ/ బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత, అనుభవం.
వయసు: 40 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 500
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.05.2018
హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేదీ: 21.05.2018
వెబ్‌సైట్: http://www.niser.ac.in/

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్

పోస్టు: షార్ట్ సర్వీస్ కమిషన్డ్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్
అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. 2018 జూన్ 30 నాటికి కోర్సు పూర్తయ్యే వారు కూడా దరఖాస్తు చేయవచ్చు.
వయసు: 45 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
ఇంటర్వ్యూ ప్రాంతం: బెంగళూరు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
చివరి తేదీ: 26.04.2018.
వెబ్‌సైట్: http://amcsscentry.gov.in

ప్రవేశాలు

ఆర్ఐఈ సీఈటీ-2018

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ)లలో ఎడ్యుకేషన్ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష.
ప్రవేశాలు కల్పించనున్న ఆర్ఐఈలు: అజ్‌మేర్, భువనేశ్వర్, భోపాల్, మైసూరు, షిల్లాంగ్, ఝజ్జర్ (హరియాణా).
కోర్సులు: 1) ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ (నాలుగేళ్లు) 2) ఎంఎస్సీ ఎడ్యుకేషన్(ఆరేళ్లు) 3) ఎంఈడీ (రెండేళ్లు) 4) బీఈడీ (రెండేళ్లు).
అర్హత: సంబంధిత సబ్జెక్టులతో ఇంటర్, బీఏ/ బీఎస్సీ/ ఎంఏ/ ఎంఎస్సీ, బీఈడీ/ బీఏ ఎడ్యుకేషన్/ బీఎస్సీ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణత.
ఎంపిక: ఆర్ఐఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఆర్ఐఈ సీఈటీ) ద్వారా.
ప్రవేశ పరీక్ష తేదీ: 10.06.2018
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.05.2018
వెబ్‌సైట్: https://ncertncee.kar.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

Q&A మైక్రోబయాలజీతో ప్రభుత్వోద్యోగాలు

బీఎస్‌సీ (మైక్రోబయాలజీ) పూర్తిచేశాను. నాకున్న ప్రభుత్వ ఉద్యోగావకాశాలేవి? ప్రభుత్వ సంస్థలు అందించే కోర్సులేమైనా ఉన్నాయా? - ఎస్.కుమారస్వామి

జ: డిగ్రీతో అర్హత ఉన్న సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్ వంటి పోటీపరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మైక్రోబయాలజీ స్పెషలైజేషన్‌లో ఉద్యోగాలకైతే సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్, క్లినికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో రిసెర్చ్ అసిస్టెంట్, ఫీల్డ్ సర్వే పర్సనల్, కెమికల్ అసిస్టెంట్‌తోపాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సైంటిఫిక్ ఆఫీసర్, ఆక్వా రంగంలో క్వాలిటీ అస్యూరెన్స్ వంటి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.



ప్రభుత్వ పరిశోధన సంస్థల్లో (పీజీఐఐఈఆర్, సీఆర్ఐజేఏఎఫ్, ఎన్ఐఏబీ, అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్) జూనియర్ రిసెర్చ్ ఫెలో, సీనియర్ రిసెర్చ్ ఫెలో వంటి అవకాశాలను పొందొచ్చు. కానీ ఇందుకు ఎంఎస్‌సీ మైక్రోబయాలజీ పూర్తిచేసి ఉండాలి. ఈ రంగంలో ముందుకు సాగాలంటే పీజీ చేయడంతోపాటు పరిశోధనపై మక్కువ పెంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును సాధించుకోవచ్చు.

● **ప్రా. బ. రాజశేఖర్,** కెరియర్ కౌన్సెలర్

పాలీసెట్-2018

సాంకేతిక విద్యకు తొలిఅడుగు!

టెన్త్ తర్వాత సంప్రదాయ డిగ్రీలకు భిన్నంగా సాంకేతిక విద్యను అభ్యసించాలనుకునే అభ్యర్థులకు పాలీసెట్ వరంలాంటిది. అభిరుచికి తగిన ఎన్నో రకాల కోర్సులు డిప్లొమా స్థాయిలో అందుబాటులో ఉన్నాయి. అవి పూర్తికాగానే ఉద్యోగాలు లభించే అవకాశాలూ ఎక్కువే. టెక్నికల్ ఎడ్యుకేషన్‌కు మొదటి అడుగు పాలిటెక్నిక్ కోర్సులతోనే ప్రారంభమవుతుంది.

తెలుగు రాష్ట్రాల్లోని సాంకేతిక విద్య శిక్షణ సంస్థలు పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పాలీసెట్)-2018 ప్రకటనలు విడుదల చేశాయి. వీటి ద్వారా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో మూడేళ్లు, ఆపై వ్యవధితో ఉన్న పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. సాంకేతిక అంశాలపై మక్కువ ఉండి, చిన్న వయసులోనే కెరియర్‌లో స్థిరపడాలనుకునేవాళ్లు డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఈ అర్హతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని పలు ఉద్యోగాలకు పోటీ పడవచ్చు లేదా ఉన్నత విద్య దిశగా అడుగులేయవచ్చు. కొన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా విద్యార్థులు క్యాంపస్ నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందుతున్నారు.

అవకాశాలు

మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు చదివినవారు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), రైల్వేల్లో జూనియర్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రస్థాయిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు కూడా డిప్లొమా అర్హతతో సబ్ ఇంజినీర్ పోస్టులు భర్తీ చేస్తున్నాయి. పాలిటెక్నిక్ తర్వాత ఈసెట్ ద్వారా నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో చేరిపోవచ్చు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలల్లో అయితే ప్రథమ సంవత్సరంలో చేరాల్సి ఉంటుంది. తక్కువ వయసులోనే స్థిరపడడానికి ఇంజినీరింగ్ డిప్లొమాలు దోహదపడతాయి. దాదాపు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ డిప్లొమా అభ్యర్థులకు అవకాశాలు లభిస్తున్నాయి. రైల్వేలో పెద్ద ఎత్తున భర్తీచేసే లోకో పైలట్ ఉద్యోగాలను సంబంధిత బ్రాంచీల్లో డిప్లొమా చదివినవారు సొంతం చేసుకోవచ్చు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ బ్రాంచీలవారికి ప్రభుత్వ రంగ సంస్థలు, అనుబంధ విభాగాల్లో ఎక్కువ ఉద్యోగాలు లభిస్తున్నాయి. విద్యుదుత్పాదక, పంపిణీ సంస్థల్లో ఎలక్ట్రికల్ విభాగం వారికి అవకాశాలు లభిస్తాయి. సివిల్ అభ్యర్థులకు నీటిపారుదల శాఖ, ప్రజారోగ్యం, రహదారులు, రైల్వే, నిర్మాణ రంగం తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ప్రవేశం లభించే కోర్సులు

సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, గార్మెంట్ టెక్నాలజీ, క్రాఫ్ట్ టెక్నాలజీ, హోమ్ సైన్స్, మెటలర్జికల్, కెమికల్, సిరామిక్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్, రెఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, పెట్రోలియం టెక్నాలజీ, పెట్రో కెమికల్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, ప్రింటింగ్ టెక్నాలజీ, క్రాఫ్ట్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఫుట్ వేర్ టెక్నాలజీ, లెదర్ టెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. మూడేళ్లు, మూడున్నరేళ్ల పాలిటెక్నిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మూడున్నరేళ్ల కోర్సుల్లో చేరినవారికి ఏడాది వ్యవధితో పారిశ్రామిక శిక్షణ ఉంటుంది.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత. ప్రస్తుతం పది పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య తేదీలు

తెలంగాణ

ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 11 సాయంత్రం 5 వరకు
పరీక్ష తేదీ: ఏప్రిల్ 21 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు
ఫలితాలు: ఏప్రిల్ 28న ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://polycetts.nic.in

ఆంధ్రప్రదేశ్

ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 14 సాయంత్రం 5 వరకు
పరీక్ష తేదీ: ఏప్రిల్ 27 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు
ఫలితాలు: మే 8న ప్రకటిస్తారు.
వెబ్‌సైట్: https://polycetap.nic.in